క్లుప్తంగా

ఓటుతోనే దేశ భవిష్యత్తు



తెనాలిఅర్బన్: దేశ భవిష్యత్‌ను మార్చేది ఓటేనని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని గుప్తా డిగ్రీ కళాశాలలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటుపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఓటు హక్కు కల్పించిందని చెప్పారు. దానిని సక్రమంగా వినియోగించడం వలన మంచి పాలకులు అధికారం చేపడతారని అన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో అంతా తమ ఓటు హక్కును వినియోగించాలని సూచించారు. అనంతరం ఓటు వేస్తామనే ప్రతిజ్ఞను అందరూ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఏసీపీ సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



తెనాలిరూరల్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆందోళన చెందకుండా సమన్వయంతో వ్యవహరించాలని తెనాలి సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కె. కృష్ణారెడ్డి విద్యార్థులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం స్థానిక అక్షరగీత విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులకు ప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

వీరేశలింగం పంతులుకు నివాళి



తెనాలిరూరల్: కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని మండలంలోని కొలకలూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఔన్నత్యాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి కడియాల సుజాత మాట్లాడుతూ చినిగిన చొక్కా అయినా తొడుక్కో.. మంచి పుస్తం కొనుక్కో అని వీరేశలింగం పంతులు విద్య యొక్క ప్రాముఖ్యతను చాటారన్నారు. 130కు పైగా గ్రంథాలను రచించిన ఆయన బాల్య వివాహాలను తీవ్రంగా వ్యతిరేకించిన సంఘసంస్కర్త అని కొనియాడారు. తెలుగు రంగస్థల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో వార్డు వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. సోమవారం 35 మంది రాజీనామా చేసిన విషయం తెలిసిందే. మంగళవారం 25 మంది తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేశారు. వాటిని సచివాలయ అడ్మిన్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ ప్రతి పక్ష నాయకులు తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధించిందని చెప్పారు. వారి చర్యలకు నిరసనగా రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. పినపాడు-1 సచివాలయ పరిధిలో 4గురు, పినపాడు-2 సచివాలయ పరిధిలో ఇద్దరు, పాండురంగపేట సచివాలయ పరిధిలో ఇద్దరు, ఇందిరానగర్ కాలనీ సచివాలయ పరిధిలో 17 మంది వలంటీర్లు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. రాజీనామాలను మంగళవారం ఆమోదించినట్లు కమిషనర్ బండి శేషన్న తెలిపారు.

నేడు నాలుగు గ్రామాల్లో రోడ్ షో

తెనాలిఅర్బన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు తెనాలి మండల పరిధిలోని తేలప్రోలు, నేలపాడు, కంచర్లపాలెం, సోమసుందరపాలెం గ్రామాల్లో రోడ్డు షో నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పింఛన్ పెంపు పండుటాకులకు వరం

- గత ప్రభుత్వంతో పోల్చుకుంటే లబ్ధిదారుల సంఖ్య రెట్టింపు
- అయిదేళ్లలో తెనాలి పట్టణంలో రూ.235 కోట్ల పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న అవ్వాతాతలు



చెంచుపేటలో కోటేశ్వరమ్మకు వృద్ధాప్య పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ రమాదేవి (ఫైల్)

తెనాలిఅర్బన్: వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, డయాలసిస్ రోగులకు పంపిణీ చేసే సామాజిక పింఛన్‌లు వారికి అసరాగా నిలుస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హతే ప్రామాణికంగా వీటిని పంపిణీ చేస్తుండటంతో లబ్ధిదారుల సంఖ్య కూడా రెట్టింపు అయ్యింది. దీంతో ప్రతి నెల రూ.4.70 కోట్ల నిధులు వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది.

రాష్ట్ర ప్రభుత్వం పేదలను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో సామాజిక పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, డప్పు కళాకారులు, ఒంటరి మహిళలకు దీనిలో భాగంగా మొదట రూ.75లు చొపున లబ్ధిదారులకు పంపిణీ చేసేవారు. ఆ తర్వాత నుంచి పెంచుకుంటూ టీడీపీ ప్రభుత్వంలో రూ.రెండు వేలు ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పింఛన్‌ను పెంచటంతో పాటు అర్హులందరికీ ఇచ్చేలా చర్యలు తీసుకుంది. దీంతో గత టీడీపీ ప్రభుత్వంలో తెనాలి పట్టణంలో 8,632 మందికి పింఛన్‌లను పంపిణీ చేసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రస్తుతం 15,759 మందికి వీటిని పంపిణీ చేస్తున్నారు. అంటే గత అయిదు సంవత్సరాలలో పాత వారితో పాటు నూతనంగా 7,127 మందికి పింఛన్‌లు అందజేస్తున్నారు.

పింఛన్ పంపిణీలో వచ్చిన మార్పులు ఇవి

గత టీడీపీ ప్రభుత్వంతో తెనాలి పట్టణంలో కేవలం 8,632 మందికి మాత్రమే సామాజిక పింఛన్‌లు ఇచ్చారు. వారిలో ఎవరైనా చనిపోతే కొత్తవారికి వారి స్థానంలో పింఛన్‌లు ఇచ్చేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేయటంతో పాటు కొత్తవారికి అర్హత వస్తే వారికి కూడా పింఛన్‌లు ఇస్తున్నారు.

- గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్‌ల పంపిణీ కేంద్రాల వద్దకు వృద్ధులు, వికలాంగులు, ఇతర లబ్ధిదారులు వెళ్లి పింఛన్‌లు తీసుకోవాల్సి వచ్చేది. అంతేకాకుండా వాటి కోసం రోజుల కొద్ది వేచి చూడాల్సి వచ్చేది. ఒక్కోసారి ఆన్‌లైన్‌లో లోపాటు ఏర్పడి రోజుల కొద్దీ పంపిణీ నిలిచిపోయిన సందర్భాలు లేకపోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వార్డు సచివాలయం, వార్డు వలంటీర్‌ల వ్యవస్థను ఏర్పాటు చేసి వారితో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకున్నారు.
- లబ్ధిదారులు అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో ఉన్నా, ఇతర ప్రాంతాలకు వెళ్లి నివసిస్తున్న అక్కడకు వెళ్లి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. అదే టీడీపీ ప్రభుత్వంలో రెండు, మూడు సార్లు పింఛన్లు తీసుకోకపోతే అవి రద్దు అయ్యే పరిస్థితి ఉండేది.
- నూతన పింఛన్‌కు దరఖాస్తు చేయాలంటే మున్సిపల్ కార్యాలయం చుట్టూ టీడీపీ ప్రభుత్వంలో తిరగాల్సి వచ్చేది. నేడు వార్డు వలంటీర్లే లబ్ధిదారును గుర్తించి దరఖాస్తు చేయిస్తున్నారు. వార్డు సచివాలయం వార్డు పరిధిలోనే ఉండటం వల్ల అర్హులు అక్కడికి వెళ్లి దరఖాస్తు చేసుకుని వాటిని పొందగలుగుతున్నారు.

అయిదేళ్లలో రూ.235 కోట్లు పంపిణీ

తెనాలి పట్టణంలో సామాజిక పింఛన్ల కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి నెల రూ.4.70 కోట్ల నిధులను వెచ్చిస్తుంది. గత టీడీపీ ప్రభుత్వంలో నెలకు కేవలం రూ.2.85 కోట్ల నిధులు వెచ్చించేవారు. గత అయిదు సంవత్సరాల నుంచి ఇప్పటి వరకు వీటి కోసం రూ.235 కోట్ల నిధులు వెచ్చించింది. గత టీడీపీ ప్రభుత్వం రూ.రెండు వేల చొప్పన లబ్ధిదారులకు పింఛన్ ఇస్తే నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.మూడు వేల చొప్పన అందిస్తుంది. దీంతో పండుటాకుల మోములో ఆనందం ఉప్పొంగుతోంది.

గతంలో పింఛన్ కోసం ఇబ్బందులు పడేవాళ్లం



ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సామాజిక పింఛనే మాకు ఆధారం. నాకు 2009 నుంచి వితంతు పింఛన్ వస్తోంది. ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌తోనే జీవనాన్ని కొనసాగిస్తున్నాను. గతంలో పింఛన్ కేంద్రానికి వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఒక్కోసారి రోజుల కొద్ది అక్కడ వేచి ఉండాల్సి వచ్చేది. నేడు ఆ పరిస్థితి లేదు.వలంటీర్లు ఉదయన్నే ఇంటికి వచ్చి పింఛన్ అందజేస్తున్నారు.

– ఎం.సరోజిని, గాంధీనగర్, తెనాలి

రవాణా ఖర్చు ఆదా



నాకు ఒంటరి మహిళ పెన్షన్ 2018 నుంచి ఇస్తున్నారు. గతంలో పెన్షన్ కోసం కేంద్రాలకు వెళ్లాలంటే ఆటో, రిక్షాలను ఆశ్రయించాల్సి వచ్చేది. దీని వలన వచ్చిన నగదులో కొంత రవాణా ఖర్చులకు పోయేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రవాణా ఖర్చులు లేకుండా చేశారు.

– జి.శ్రీలక్ష్మి, ముత్తెంశెట్టిపాలెం, తెనాలి

నిద్రలేవకముందే ఇంటికి పింఛన్



గతంతో పోల్చుకుంటే నేడు పింఛన్ల పంపిణీ చాలా బాగుంది. వలంటీర్లు 1వ తేదీ ఉదయన్నే నిద్ర లేవకముందే వలంటీర్లు ఇళ్ళకు వచ్చి పంపిణీ చేస్తున్నారు. వారు అందిస్తున్న సేవలు చాలా బాగున్నాయి.

– పి.బాలకోటయ్య, ఐతానగర్, తెనాలి

అర్హత వచ్చిన వెంటనే పింఛన్ మంజూరు



గతంలో పింఛన్లు మంజూరు కావాలంటే ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ జగన్ సీఎం అయిన తరువాత అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్నారు. కొత్తగా ఎవరికైనా అర్హత వస్తే వారిని కూడా వెనువెంటనే లబ్ధిదారుల జాబితాలో చేరుస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ నెలలో కిడ్నీలు చెడిపోవడంతో డయాలసిస్ చేయించుకుంటున్నాను. వైద్యులు నుంచి డయాలసిస్ సర్టిఫికెట్ తీసుకువచ్చి అందజేసిన వెంటనే నాకు పింఛన్ మంజూరు చేశారు. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– సీహెచ్ ఆదిరెడ్డి, చంద్రబాబు కాలనీ, తెనాలి

25 నుంచి రక్షణ సువార్త సభలు



తెనాలిరూరల్: మండల గ్రామం పెదరావూరులోని తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి వార్షికోత్సవ రక్షణ సువార్త సభలు నిర్వహించనున్నారు. సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సంఘకాపరి పి.చిట్టిబాబు, సంఘ అధ్యక్షుడు చొప్పర సుధాకర్, సంఘ పెద్దలు, స్త్రీల సమాజం సభ్యులు ఆవిష్కరించారు. ఉపాధ్యక్షుడు రావూరి మరియదాసు, కార్యదర్శి కారుమూరి శ్రీనివాసరావు, కోశాధికారి బుల్లా రాంబాబు, కొలకలూరి ప్రభుదాసు, కొత్తపల్లి శామ్యూల్, నంబూరు లాబాను, తదితరులు పాల్గొన్నారు.

చర్చికి మార్చురీ బాక్సు బహూకరణ



తెనాలిరూరల్: ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొడాలి శకుంతలమ్మ, రామచౌదరి జ్ఞాపకార్థం రూరల్ మండలం పెదరావూరు గ్రామంలోని బాప్టిస్ట్ చర్చికి మార్చురీ బాక్సును మంగళవారం బహూకరించారు. సంఘకాపరి రెంవరెండ్ డాక్టర్ పి.చిట్టిబాబు, సంఘ అధ్యక్షుడు చొప్పర సుధాకర్, సంఘ పెద్దలకు ఈదర పూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు మార్చురీ బాక్సును అందజేశారు. గ్రామ నాయకులు పాలడుగు సురేంద్ర, బుల్లా రాంబాబు, కె. ప్రభుదాస్, వి. మోహన్, కె. శామ్యేల్, పి.సుధాకర్, ఎన్.బాబు, పి.యోహాను, ఆర్.మరియదాసు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలను బాగు చేయించుకోండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



నీటి కుంటలను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: ఖాళీ స్థలాలను యజమానులు బాగు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని బీసీ కాలనీలో ఖాళీగా ఉన్న స్థలాలను, నీటి కుంటాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి దోమలకు ఆవాసాలుగా మారయాని తెలిపారు. వీటి వలన దోమల వ్యాప్తి పెరిగిందని చెప్పారు. యాజమానులు తమ స్థలాల్లో ఉన్న పిచ్చి మొక్కలను, మురుగునీటిని తొలగించాలని సూచించారు. అలా చేయని వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆయన వెంట ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, ఎస్.సుబ్బారావు, శానిటేషన్ సెక్రటరీ విజయ్‌చందర్, తదితరులు ఉన్నారు.

‘అయిదేళ్ల పాలనలో అందరికీ అండగా నిలిచా’

కేబుల్ ఆపరేటర్లతో ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: త్వరలో జరగనున్న ఎన్నికల్లో స్థానికుడుగా అందరికీ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న తన విజయానికి సహకరించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కోరారు. స్థానిక ఎస్ ఛానల్ కేబుల్ ఆపరేటర్లతో ఆత్మీయ సమావేశాన్ని మంగళవారం ఇక్కడి దేవీచౌక్‌లోని ఏ1 కన్వెన్షను హాలులో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత అయిదేళ్లుగా ఎమ్మెల్యేగా చేసిన తన నడక, నడత ఆధారంగా కేబుల్ ఆపరేటర్లు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రజాభిప్రాయానికి భిన్నంగా తాను ఏనాడూ పని చేయలేదనీ పేదవారి సంక్షేమం కోసం కృషి చేశానని గుర్తుచేశారు. తనకు ఓటు వేయనివారిపై ఎలాంటి వివక్ష ప్రదర్శించలేదని గుర్తుచేశారు. సమాజానికి సేవలను అందిస్తున్న కేబుల్ ఆపరేటర్లకు ఎలాంటి కష్టం వచ్చినా తాను అందుబాటులో ఉన్నానని భవిష్యత్‌లోనూ ఉంటానని హామీనిచ్చారు. సమావేశంలో పట్టణ, రూరల్ మండలాల కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

సగర సామాజికవర్గ అభివృద్ధే ధ్యేయం

- సగర సంఘీయుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్
- నాలుగు లైన్ల రహదారి ఆగిపోవటానికి మాజీ ఎమ్మెల్యేలే కారణం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: సగర సంఘీయుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హామీనిచ్చారు. గతంలో పదేళ్లు ఎమ్మెల్యేగా చేసిన నాదెండ్ల మనోహర్, తర్వాత అయిదేళ్లు ఎమ్మెల్యేగా చేసిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లలో ఏ ఒక్కరూ సగరులకు ఇళ్లస్థలాలు ఇవ్వలేకపోయారని చెప్పారు. తన హయాంలో కేవలం తొమ్మిదో వార్డులోనే 300 మంది సగరులకు ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్లతో సహా ఇవ్వగలిగానని ఎమ్మెల్యే శివకుమార్ గుర్తుచేశారు. పట్టణ బుర్రిపాలెరోడ్డులోని పశువుల ఆసుపత్రి సమీపంలో సోమవారం జరిగిన సగర సంఘీయుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో చిన్న కులాల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం అందిస్తూ తోడ్పడుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి బాటలోనే తాను నియోజకవర్గంలో బడుగు బలహీనవర్గాలు, వెనుకబడిన కులాల జీవితాల్లో మార్పు కోసం కృషి చేస్తున్నానని చెప్పారు.

శ్రమశక్తి నుంచి ఇప్పుడిప్పుడే వ్యాపారాల వైపుకు మళ్లిన సగరులు మార్కెట్లో చేస్తున్న వ్యాపారాలకు తాను ఎటువంటి ఆటంకం లేకుండా చూశానని శివకుమార్ చెప్పారు. కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ పదేళ్లు ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నపుడు ఫుట్‌పాత్‌ల మీద, తోపుడు బండ్లతో జీవనం సాగించే చిరు వ్యాపారుల నుంచి డబ్బులు గుంజుకున్నది అందరికీ తెలిసిన విషయమేనని అన్నారు. గత అయిదేళ్లలో ఎమ్మెల్యేగా తాను ఎలాంటి అవినీతికి పాల్పడకుండా పేద సామాజిక వర్గాలకు ఉపయోగపడినట్టు చెప్పారు. స్థానికంగా అందుబాటులో ఉంటూ ఇంటింటికీ వచ్చానని చెప్పారు.

పెదరావూరు-నందివెలుగు నాలుగు లైన్ల రోడ్డు పూర్తి కాకుండా కాంట్రాక్టర్ నాగమోహన్ తాత్సారం చేశారని చెబుతూ ఇందుకు నాదెండ్ల మనోహర్, తర్వాత వచ్చిన ఆలపాటి రాజాలే కారణమన్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక తన దగ్గరకొచ్చిన కాంట్రాక్టరు, గతంలో ఎమ్మెల్యేలు పెట్టిన ఇబ్బందులతో బిల్లులు రాలేదని మొరపెట్టుకున్నారని దీనితో పెండింగులో ఉన్న రూ.కోటిన్నర బిల్లును కూడా ఇప్పించానని శివకుమార్ గుర్తు చేసుకున్నారు. రోడ్డు వేయకుండా పారిపోయిన కాంట్రాక్టర్ ఇటీవల ప్రత్యక్షమై స్థానిక స్టార్ హోటల్‌లో కమ్మ వారందరికీ భోజనాలు పెట్టించి, మనోహర్‌కు సపోర్టు చేయాలని చెప్పటం చిత్రమన్నారు. అవినీతికి, దోపిడీకి పాల్పడేవారు అధికారంలో ఉంటే అభివృద్ధి వెనుకబడుతుందని వాపోయారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనను గెలిపించటం ద్వారా మరోసారి ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికయ్యేందుకు సహకరించాలని కోరారు. పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మందపాటి శేషగిరిరావు, వార్డు కౌన్సిలరు వీరిశెట్టి భాస్కర్, ముద్రబోయిన మహేంద్ర, ములకి జయకృష్ణ, ముద్రబోయిన శ్రీనివాసరావు, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, కటారి మల్లేశ్వరరావు, గండికోట ప్రసాద్, కుంభం వెంకటకుమార్ పాల్గొన్నారు.

అడుగడుగునా అభిమాన పలకరింపులు

- తెనాలి పట్టణంలో రెండోరోజు కొనసాగిన ఎమ్మెల్యే శివకుమార్ రోడ్ షో
- స్వచ్ఛందంగా బయటకు వచ్చి మద్దతు తెలిపిన పలు వార్డుల ప్రజలు



22వ వార్డులో కర్బూజ కాయల భారీ దండను ఎమ్మెల్యేకు వేస్తున్న పార్టీ నాయకులు



21వ వార్డులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్: వైఎస్సార్ సీపీకి రెండోసారి పట్టం కట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని 21, 22, 23, 24, 25 వార్డులలో మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్డు షో నిర్వహించారు. 21వ వార్డు కొత్త వంతెన సమీపంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, డాక్టర్ రియాజ్‌ఖాన్, వార్డు నాయకులు ఎమ్మెల్యే శివకుమార్‌కు ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి మారీసుపేటలోని పలు వీధుల్లో రోడ్డు షో కొనసాగింది. మఠంబజార్ వద్ద 22వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ క్లస్టర్-2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శివకుమార్‌కు ఘనస్వాగతం పలికారు. మహిళలు ఎమ్మెల్యేకు హారతులిచ్చారు. కర్బూజ కాయల భారీ దండను పార్టీ నాయకులు ఆయనకు వేసి సన్మానించారు. అక్కడి నుంచి మారీసుపేట రెండుగేట్ల మధ్యకు ప్రచార వాహనం వచ్చింది. 23, 24 వార్డుల వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు పెదలంక లక్ష్మీలావణ్య, పెదలంక వెంకటేశ్వరరావు దంపతులు, తోక శిరీష, తోట వాసు దంపతులు, మేకల రవి, మేకల సురేష్, సుభానీ, తదితర నాయకులు ఎమ్మెల్యే శివకుమార్‌కు ఘనం స్వాగతం పలికి మెమెంటోను అందజేశారు. అక్కడి నుంచి రెండు గేట్ల మధ్య ఆర్.ఆర్.నగర్, చంద్రబాబునాయుడు కాలనీ, శాంతినగర్ మీదుగా పినపాడుకు రోడ్డు షో చేరుకుంది. 25వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య, పార్టీ నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికి సన్మానాలు చేశారు. ప్రతి వార్డులో మహిళలు ఎమ్మెల్యేకు హారతులు ఇచ్చారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మందపాటి శేషగిరిరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు యాతాటి అనిల్, తోట రఘురామ్, గుంటూరు కోటేశ్వరరావు, పేరం సంజీవరెడ్డి, షేక్ ఇస్మాయేల్, మొగల్ అహ్మద్ బేగ్, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు జాకీరా, సెల్వీ, బొమ్ము నాగిరెడ్డి, తాడిబోయిన రమేష్, బూరెల దుర్గ, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, కాళిదాసు వెంకటసత్యం, కాళిదాసు వెంకటేశ్వరరావు, కాకి దేవసహాయం, టోపీ సుభానీ, దేవరపల్లి కిషోర్, అక్కిదాసు కిరణ్‌కుమార్, కోగంటి ఆషు, రావి శ్రీనివాసరావు, పెసర్లంక రమణ, పోతవరపుల పురుషోత్తమశర్మ, చుండూరు వెంకటేశ్వరరావు, చుక్కా ఆనంద్, గోల్డ్ రహీమా, టెక్స్ బాల, కొమ్ము రాయల్, వేజండ్ల శ్రీకాంత్, కఠారి హరీష్, జిలానీ, గొర్రెపాటి వేణుగోపాలరెడ్డి, ఉడుముల మహేష్, కుర్రా జశ్వంత్, షేక్ మీరావలి, కుక్కల ముక్తేశ్వరరావు, శానంపూడి రఘురామిరెడ్డి, పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పలు వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో అద్భుతం ‘అనితరుడు’



అనితరుడు పుస్తకాన్ని ఆవిష్కరించిన డాక్టర్ గుమ్మా సాంబశివరావు

తెనాలి: ప్రముఖ కవి ముప్వా శ్రీనివాసరావు తన కవిత్వంలో చేసిన అభివ్యక్తులు తెలుగు సాహిత్యంలో మరెవ్వరూ చేయలేదని, ఆయన కవిత్వంలో కొత్త కొత్త పద ప్రయోగాలెన్నో ఆశ్చర్యపరుస్తాయని ప్రముఖ విశ్లేషకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు అన్నారు. సమతా ఆర్ట్స్ థియేటర్, ప్రజ్వలిత సంస్థల సంయుక్త నిర్వహణలో మంగళవారం రాత్రి స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఖమ్మంకు చెందిన ప్రముఖ కవి ముప్వా శ్రీనివాసరావు సాహిత్యంపై 366 మంది విశ్లేషణలతో 1345 పేజీలతో రూపొందించిన ‘అనితరుడు’ (కవితాంతరంగ విశ్లేషణలు ఎట్ 366) పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి పరిచయం చేశారు. తెనాలి కవి జుగాష్ విలి అధ్యక్షత వహించారు. డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ సమకాలీన ఏ కవిపైనా ఇంతటి విశ్లేషణ రాలేదన్నారు. శ్రీశ్రీ సమకాలీనుడు అవత్స సోమసుందర్ సహా ఎందరో కవులు, రచయితలు, ఆచార్యులు విశ్లేషణలతో ‘అనితరుడు’కు ప్రామాణికత ఏర్పడిందన్నారు. బాపట్లకు చెందిన అంబటి మురళీకృష్ణ తన ప్రసంగంలో ముప్వా శ్రీనివాసరావు కవిత్వం మానవీయత నిండినదని చెప్పారు. కవి ముప్వా శ్రీనివాసరావు తన కృతజ్ఞతాపూర్వక ప్రసంగంలో తొలి విమర్శ గ్రంథం రాసిన కందుకూరి వీరేశలింగం జయంతిరోజునే తన బృహద్గంథం ఆవిష్కరణ సంతోషంగా ఉందన్నారు. ప్రజ్వలిత వ్యవస్థాపకుడు దివంగత నాగళ్ల వెంకట దుర్గాప్రసాద్‌ను స్మరించుకున్నారు. సమతా ఆర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు కనపర్తి బాబూరావు, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, నాగార్జున యూనివర్శిటీ అంబేద్కర్ చైర్‌పర్సన్ డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్ మాట్లాడారు. ఎం.రామలింగేశ్వరరావు, కొండముది రమేష్‌బాబు పర్యవేక్షించారు. ఇదే సభలో సాంఘిక నాటక రంగంలో ఎన్నో సంచలనాలు సృష్టించిన సమతా ఆర్ట్స్ థియేటర్ 45వ వార్షికోత్సవాన ‘ముట్టడి’ నాటకం రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శించిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజాచే జ్ఞాపికలను బహూకరించారు. సభానంతరం ముట్టడి ప్రకాష్ రచించి, దర్శకత్వం వహించిన సమతా ఆర్ట్స్ థియేటర్ వారి ‘మానవ రాజ్యం’ సాంఘిక నాటికను ప్రదర్శించారు. బెల్లంకొండ వెంకట్, కనపర్తి మధుకర్, వేము రామరాజు, నాగం రమేష్, గుంటుపల్లి వసంతయామిని, బుగ్గే శ్రీరామ్, అద్దంకి శ్రీనివాసన్ నటించారు. సభకు ముందు ప్రముఖ నృత్యగురువు ఆరాధ్యుల తేజస్వి శిష్యబృందం సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


ఏఎస్ఎన్ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ



జాతీయ సదస్సులో అవార్డు అందుకుంటున్న ఏఎస్ఎన్ ఫార్మసీ విద్యార్థులు

తెనాలిరూరల్: ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ముంబై, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ స్టూడెంట్ ఫోరం, పానిపట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించిన ‘13వ జాతీయ ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ స్టూడెంట్ కాంగ్రెస్’ లో తెనాలి ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ నెల 12 నుంచి 14 వరకు హర్యానాలోని ‘పానిపట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఎంపవరింగ్ ఫ్యూచర్ ఫార్మాప్రెన్యూర్స్ ఫర్ నావిగేటింగ్ హెల్త్ కేర్ టెక్నాలజీ’ అనే అంశం పై జాతీయ సదస్సు నిర్వహించారు. తెనాలి ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల నుంచి 46 మంది విద్యార్థులు, అధ్యాపకులు ఈ సదస్సు లో పాల్గొన్నారు. పేపర్ ప్రెజెంటేషన్, కల్చరల్ ఈవెంట్స్‌లో పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో ఐపీఎస్ఎఫ్ చాప్టర్స్‌లో బెస్ట్ స్టూడెంట్ చాప్టర్ అవార్డు ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల స్టూడెంట్ చాప్టర్‌కి దక్కింది. ఈ అవార్డును నేషనల్ ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్(ఐపీఏ) అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ, ఐపీఏ ఎడ్యుకేషన్ డివిజన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్. విద్యాధర, అడిషనల్ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ ఎ. రాం కిషన్‌ల చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకట రమణ ఐపీఎస్ఎఫ్ మెంటర్ ఫణీకృష్ణ, విద్యార్థులు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అన్నాబత్తుని శివ కుమార్, అధ్యాపకులు వీరిని మంగళవారం అభినందించారు.

నవమి వేడుకలకు ఆలయాలు సిద్ధం



విద్యుత్తు కాంతులీనుతున్న శ్రీ సీతారామాంజనేయ దేవస్థానం

తెనాలిరూరల్: రాములోరి పెళ్లిని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తెనాలిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రెండో భద్రాద్రిగా పేరుగాంచిన తెనాలిలో ప్రతి యేటా శ్రీరామ నవమి ఉత్సవాలను వేడుకగా నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. బుధవారం జరుగనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఊరంతా పందిళ్లు వేసి విస్తృత ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో భారీ చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. రామాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వాడవాడలా వెలసిన తాటాకు పందిళ్లు చూడ ముచ్చట గొలుపుతూ ఆకట్టుకుంటున్నాయి. శ్రీ సీతారాముల వారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించేందుకు ప్రముఖ రామ మందిరాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గాడిబావి సెంటర్లోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం వద్ద ఇప్పటికే చలువ పందిళ్లను సిద్ధం చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఇక్కడ 9వ తేదీ నుంచి స్వామి వారి కల్యాణ ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఉత్సవాలలో భాగంగా ప్రతి రోజు స్వామి వారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలలో భాగంగా విశేషంగా కుంకుమార్చన పూజలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొంటున్నారు. 17వ తేదీ బుధవారం నవమి నాడు ఉదయం 11 గంటలకు శ్రీ సీతారామచంద్ర స్వామి వార్ల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఇక్కడ 19 వరకూ ఉత్సవాలు జరుగుతాయి. 18న ఉదయం 8 గంటలకు శేషవాహనంపై స్వామి వార్ల గ్రామోత్సవం, సాయంత్రం 5 గంటలకు స్వామి వార్ల దివ్య రథోత్సవం అత్యంత వైభవంగా జరుగనుంది.